సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023





## ప్రజావాణికి 137 ఫిర్యాదులు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 137 వినతులు వచ్చాయి.

- 8లో ▸




## బడ్జెట్ రూ. 52.35 కోట్లు

బోధన్ బల్దియా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రూ. 52.35 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /19.9

## వాతావరణం

ఉదయం చలిగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి శీతల గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### డీఎస్‌కు అస్వస్థతతో ఎంపీ కార్యక్రమాలు రద్దు

ఖలీల్‌వాడి : ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ అస్వస్థతకు గురికావడంతో తన కార్యక్రమాలను రద్దు చేసుకున్నట్లు ఆయన తనయుడు ఎంపీ అర్వింద్ ప్రకటించారు. డీఎస్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఫిట్స్ రావడంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రికి తరలించారు. ఎంపీ అర్వింద్ డీఎస్‌కు దగ్గరుంచి వైద్య పరీక్షలు చేయిస్తున్నారు.

### సదరం క్యాంపులు ఖరారు

● నేటి నుంచి స్లాట్ బుకింగ్

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో 2023 మార్చిలో నిర్వహించనున్న సదరం క్యాంపులకు షెడ్యూల్ ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీతో పాటు 15, 29 తేదీల్లో క్యాంపులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉంటాయన్నారు. అయితే, సదరం క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కేటాయింపబడిన తేదీల్లో స్లాట్ రసీదుతో పాటు ఆధార్, మెడికల్ రిపోర్టులు వెంట తీసుకుని క్యాంపులకు హాజరుకావాలని సూచించారు.

### కరీంనగర్ డెమో రైలు బోధన్ వరకు పొడిగింపు

బోధన్: నిజామాబాద్ -కరీంనగర్ మధ్య నడిచే డెమో రైలును బోధన్ వరకు పొడిగించారు. గతేడాది ఆఖరులోనే బోధన్ వరకు పొడిస్తామని రైల్వేశాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. అయితే ఈ నెల 13 నుంచి డెమో రైలును బోధన్ వరకు పొడిగించారు. కానీ ఇక్కడ నుంచి ప్రయాణికులను అనుమతించలేదు. తాజాగా ఆదివారం నుంచి ప్రయాణికులను అనుమతిస్తూ టిక్కెట్లు జారీ చేస్తున్నారు. ప్రతి రోజు ఈ రైలు కరీంనగర్ నుంచి మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరి రాత్రి 8.40 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. బోధన్‌కు 9.30 గంటలకు వస్తుంది. మరుసటి రోజు ఉదయం 4 గంటలకు బయలుదేరి వెళ్తుంది. ఉదయం 4.45 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 7.55 గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది.

### పీఎం కిసాన్‌కు 1,24,482 మంది అర్హులు

ఇందూరు: పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పంట పెట్టుబడి డబ్బులు రెండు, మూడు రోజుల్లో జమకానున్నాయి. సోమవారం ప్రధాని మోదీ కర్ణాటకలో 13వ విడత పీఎం కిసాన్ నిధులను దేశ వ్యాప్తంగా విడుదల చేశారు. అయితే, వ్యవసాయ శాఖ లెక్క ప్రకారం జిల్లాలో 13వ విడతకు 1,24,482 మంది రైతులు అర్హులుగా ఉన్నారు. వీరికి రూ. 24.89 లక్షలు అవసరం అవుతున్నాయి. ఎంతమంది ఖాతాల్లో నిధులు జమయ్యాయో వ్యవసాయ శాఖకు నేడు వివరాలు అందే అవకాశాలున్నాయి. అదే విధంగా జిల్లాలో ఇంకా 12,409 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోనివారు ఉన్నారు. కేవైసీ లింక్ చేస్తే వీరికి డబ్బులు జమ కానున్నాయి.

### వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బాన్సువాడ టౌన్: బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామివారిని పెద్ద శేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని నడిపారు. దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

### ప్లాట్‌ఫాంపైకి పోలీసు వాహనం



సాక్షి, కామారెడ్డి: పోలీస్ పెట్రోలింగ్ వాహనం అదుపుతప్పి బస్టాండ్ ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో చోటు చేసుకుంది. రాత్రి వేళలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం వేగంగా బస్టాండ్‌లోకి రావడంతో అదుపుతప్పి ప్లాట్‌ఫాంపైకి వచ్చి, పిల్లర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

# ఎత్తిపోతున్న బోర్లు

వేసవి ప్రారంభ దశలోనే పలు ప్రాంతాల్లో యాసంగి పంటలు ఎండుముఖం పడుతున్నాయి. భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. వట్టి మోటార్లే తిరుగుతున్నాయి తప్ప నీళ్లు పోయడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల పెట్టుబడి రూ. వేలల్లో నష్టపోవాల్సి వస్తోందని అంటున్నారు.



■ ఈ చిత్రంలో కనిపిస్తున్నది కొత్తగా తవ్వించిన బోరు బావి. 660 ఫీట్ల లోతు వేసినా చుక్క నీరు పడలేదు. ఆ బోరు పక్కనే ఉన్నది ముషీర్‌నగర్ గ్రామ రైతు బట్టు గోపాల్‌కు చెందిన నాలుగెకరాల పొలం. పాత బోరులో నీళ్లు పూర్తిగా వట్టిపోవడంతో పొలం ఎండిపోతున్నదని కొత్తగా బోరు వేయించాడు. కానీ నీళ్లుపడలేదు. పంట పెట్టుబడికి తోడు నీళ్లు పడని బోరుకు చేసిన ఖర్చు రూ. 93 వేలు నష్టపోవాల్సి వస్తోంది.

- లోతుల్లోకి భూగర్భ జలాలు
- వరికి చివరి తడులపై నిరాశ
- పలుచోట్ల ఎండిపోతున్న పంటలు
- యాసంగి పెట్టుబడులు నష్టపోతున్న రైతులు



గడ్కోల్‌లో పూర్తిగా ఎండిపోయిన పొలం

సిరికొండ/భీమ్‌గల్ : యాసంగి సీజన్‌లో బోరు బావులను నమ్ముకొని రైతులు వరి, మొక్కజొన్న ఇతర ఆరుతడి పంటలను సాగు చేశారు. జిల్లాలో వ్యాప్తంగా 4,81,426 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో కేవలం వరి 3,90,269 ఎకరాల్లో సాగవుతోంది. బోరు బావులు ఎత్తిపోతుండటంతో చివరి తడులకు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొద్ది మేర ఎండిన వరిని కోసి పశువులకు మేతగా వేస్తున్నారు. వరి ఎకరానికి రూ.30 వేలు, మొక్కజొన్నకు రూ. 10 వేలు, జొన్నకు రూ.10 వేల వరకు పెట్టు బడులు పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. యాసంగిలో సిరికొండ మండలంలో 23,300 ఎకరాల్లో వరి, 760 ఎకరాల్లో మొక్కజొన్న, 130 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, ఉల్లి తదితర పంటలను సాగుచేశారు. వరి నాటిన తర్వాత చలి తీవ్రత పెరగడంతో పొలాలు ఎదగలేకపోయాయి. దీనికి తోడు చీడపీడల ఉధృతి పెరగడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పొలాలను కాపాడుకోవడానికి రూ. వేలల్లో ఖర్చు చేసి పురుగు మందులను స్ప్రే చేశారు. పొలాలు ఇప్పుడిప్పుడే ఎదిగి పొట్ట దశకు చేరుతున్నాయి. ఇంతలోనే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. రూ. వేలల్లో ఖర్చు చేసి కాపాడుకున్న పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

**జిల్లాలో అతితక్కువ నీటి మట్టాలు గల ప్రాంతాలు (మీటర్లలో)**

| | నవంబర్ 2022 | డిసెంబర్ 2022 | జనవరి 2023 |
|---|---|---|---|
| గోన్ గొప్పుల (భీమ్‌గల్) | 12.74 | 18.27 | 21.12 |
| చిన్న మావండి (బోధన్) | 19.48 | 19.76 | 20.49 |
| ముషిర్ నగర్ (సిరికొండ) | 7.99 | 14.05 | 20.33 |
| చీమన్‌పల్లి (సిరికొండ) | 8.65 | 17.68 | 18.76 |
| గండి గుట్ట (రెంజల్) | 6.71 | 8.88 | 18.98 |





భీమ్‌గల్‌లో తక్కువ నీటిని పోస్తున్న బోరు, వరి ఎండిపోవడంతో పశువులకు మేతగా కోస్తున్న రైతు

### ప్రభుత్వం ఆదుకోవాలి



బోరు ఎండిపోవడంతో మూడెకరాల పొలం ఎండిపోయింది. పొలం దున్నించడానికి, నాట్లు వేయడానికి, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి రూ. వేలల్లో ఖర్చు పెట్టాను. పక్కపొలంలోని బోర్లలో కూడా నీళ్లు తగ్గడంతో వారు మా పొలానికి నీళ్లు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. - శంకర్, రైతు ముషీర్‌నగర్

### రెండెకరాల పొలం ఎండిపోయింది



బోర్లలో నీళ్లు తగ్గడంతో సాగు చేసిన దాంట్లో రెండెకరాల పొలం ఎండిపోయింది. మరో నెల రోజుల్లో కోత కోసుకోవాల్సిన పొలం ఎండిపోవడంతో పెట్టుబడి నష్టపోవాల్సి వస్తోంది. ఎండిపోతున్న పొలాన్ని కాపాడుకోవడానికి కొత్తగా బోరు వేద్దామంటే నీళ్లపడతాయన్న గ్యారంటీ లేకపాయే.

- రాజు, రైతు ముషీర్‌నగర్

### చాలా దూరం నుంచి..



కొద్ది రోజుల క్రితం వరకు బోర్లు మంచిగానే నీళ్లు పోసాయి. ఇప్పుడు బోర్లు తక్కువగా పోస్తున్నాయి. మొత్తం పంట చేతికి రావడం కష్టంగానే ఉంది. పంటను కాపాడుకోవడానికి చాలా దూరం నుంచి పైపులు కట్టి నీటిని తెచ్చుకుంటున్నాము. పైపులకు అదనపు ఖర్చు భారమైంది.

- కిష్టి కిషన్, రైతు, బాబాపూర్

# దర్జాగా కబ్జాలు..!

- నకిలీ పట్టాల వ్యవహారంలో వెలుగులోకి కొత్త విషయాలు
- అక్రమార్కులకు ఓ ప్రజాప్రతినిధి సోదరుడి అండ
- నాగారంలో ఇళ్లస్థలాల కబ్జాల వెనుక ఓ ప్రధాన పత్రిక విలేకరి

ఖలీల్‌వాడి: నకిలీ పట్టాల వ్యవహారంలో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కేసులో పాత్రదారులు అరెస్టు కావడంతో అసలు సూత్రధారుల రంగులు బయట పడుతున్నాయి. ఓ ప్రజాప్రతినిధి సోదరుడి అండతో రెచ్చిపోయిన సూత్రధారులు ఒకవైపు.. మరోవైపు ఓ ప్రధాన పత్రిక విలేకరి అండతో తన ముఠా నాగారంలోని ఇళ్లస్థలాలకు అక్రమ పట్టాలు సృష్టించి స్థలాలు కబ్జాలు చేస్తూ అమాయకులకు అంటగట్టి ఇలా అందిన కాడికి దండుకుంటున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులకు వాటాలు రావడంతో దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారు. వాటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ పట్టాల వ్యవహారంలో సీపీ కేఆర్ నాగరాజు పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. గతంలో రవిశంకర్ అయ్యర్ ఎస్పీగా ఉన్న సమయంలో రెవెన్యూ స్టాంపుల కుంభకోణం వెలికి తీయగా.. తాజాగా సీపీ నాగరాజు నకిలీ పట్టాలపై దృష్టి సారిస్తున్నారనే చర్చ నగరంలో కొనసాగుతోంది.

**బెదిరింపులకు దిగుతూ..**

నాగారంలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలపై ఓ ప్రధాన పత్రిక విలేకరి ముఠా సభ్యుల కన్ను పడింది. సదరు ముఠా సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఉంటున్న నిరుపేదల వద్దకు వెళ్లి.. తమకు పట్టాలు ఉన్నట్లు చూపించి స్థలం తమదేనని బెదిరింపులకు దిగుతారు. ఎవరైనా వినకపోతే సదరు రిపోర్టర్ అధికారులకు, పోలీసులకు ఫోన్‌లో వివరించి అంతా సెట్ చేస్తారు.

ఇలా నాగారంలోని బలహీన వర్గాల వారికి చెందిన కొంతమంది ప్లాట్లను కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. అలాగే అనేక వాటికి నకిలీ పట్టాలను సృష్టించి అమ్మేసిన ఘటనలున్నాయి. అంతేకాకుండా సదరు విలే కరి డిచ్‌పల్లి, నాగారంలోని వెంచర్లకు సంబంధించిన సెటిల్‌మెంట్లు చేసినట్లు తెలిసింది.

### ప్రజాప్రతినిధి సోదరుడి అండతో..

నగరంలోని లిటిగేషన్ ల్యాండ్స్, వారసులు లేని, ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించి ఏ సెటిల్‌మెంట్ అయినా నగరంలో ఓ ప్రజాప్రతినిధి సోదరుడి కనుసన్నల్లో జరగాలి. ఇతనికి అత్యంత సన్నిహితులుగా ఉన్న ఇద్దరు బీఆర్ఎస్ నేతలు రంగంలోకి దిగి స్థలాన్ని కబ్జా చేసేందుకు అంతా సెట్ చేస్తారు. అధికారులు, పోలీసుల వద్దకు పంచాయితీ వెళితే సదరు ప్రజాప్రతినిధి సోదరుడు ఫోన్‌లో మాట్లాడి సెటిల్ చేసేస్తారు. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో 600 గజాలు, 300 గజాల స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా నగరంలోని ప్రజాప్రతినిధుల నుంచి ప్రతినెలా ఠంఛన్‌గా సదరు ప్రజాప్రతినిధి సోదరుడికి మామూళ్లు వెళ్లాల్సిందే. లేదంటే వారికి ఫోన్ వెళ్తుందని ప్రచారం ఉంది. నగర ప్రజాప్రతినిధుల భూముల కబ్జాల వ్యవహారంపై ఆయనకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది.

### కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం మొత్తం 201 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్యాధికా రి ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

### కుక్కల బెడదపై మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్

**బోధన్ మున్సిపాలిటీ**

బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల విపరీతంగా పెరిగిన కుక్కల సంతతి, పారిశుధ్యం, ఇతర సమస్యలపై బోధన్ మున్సిపల్ కమిషనర్‌తో ఆదివారం ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందుల గురించి ఫోన్ చేసి మాట్లాడొచ్చు.



ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, బోధన్

తేది : 28-2-2023 (మంగళవారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్ : 63052 49776

# కుక్కల బెడద నివారించాలి

నగరంలో కుక్కల బెడద తీవ్రంగా మారిందని.. సమస్యను పరిష్కరించాలని నగరవాసులు మేయర్ నీతూకిరణ్‌కు విన్నవించారు. కుక్కల కారణంగా బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నగరంలో పారిశుధ్య సమస్య, డ్రెయినేజీల సమస్యల నిర్వహణ సరిగ్గా లేదని, పలుచోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి నగరంలోని నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. నగరవాసులు చెప్పిన సమస్యలను మేయర్ స్వయంగా రాసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించిన 'సాక్షి'కి మేయర్ ధన్యవాదాలు తెలిపారు. - నిజామాబాద్‌నాగారం



- మేయర్ నీతూకిరణ్‌కు సమస్యలు విన్నవించిన నగరవాసులు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు భారీ స్పందన

■ మా కాలనీలో బాబును 15 రోజుల కిందట కుక్క కరిచింది. అంతకు ముందు వేరే వాళ్లకు కూడా కరిచాయి. కుక్కలను నివారించాలి. -నరేశ్, మల్లేశ్‌రెడ్డి, వెనిగల్ల సురేష్, సందీప్‌రెడ్డి, మహాలక్ష్మినగర్

✤ నగరంలో కుక్కల బెడద ఉన్నమాట వాస్తవమే.. కుక్కలు పట్టే వారు ఈ రోజు వస్తున్నారు. మీ ప్రాంతానికి సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ ద్వారా కుక్కలు పట్టే వారిని పంపించి సమస్య లేకుండా పరిష్కరిస్తాం.

■ కుక్కల కారణంగా రాత్రి 7 దాటితే బయటకు వెళ్లలేకపోతున్నాం. ఒకేసారిగా గుంపులు గుంపులుగా మీదికి వస్తున్నాయి. -లింగయ్య, రోటరీ నగర్

✤ మీరు ఆందోళన చెందకండి. కుక్కలను పట్టే టీంను మీ ప్రాంతానికి పంపిస్తాం. ఏ ప్రాంతంలో ఉన్నాయే చెబితే కుక్కలను పట్టుకొని తీసుకెళ్తారు.

■ 45వ డివిజన్‌లోని సార్వజనిక్ శ్మశాన వాటిక, కాకతీయ కాలేజీ ప్రాంతంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. -రజిత, అనిల్‌కుమార్

■ ఆదర్శనగర్‌లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవలే ఓ ఆవును కుక్క కరవడంతో ఆవు చనిపోయింది. కుక్కల బెడదతో బయటకు వెళ్లలేకపోతున్నాం. -మహేశ్, ఆదర్శనగర్

✤ మీ సమస్యను నోట్ చేసుకున్నాం. రెండు, మూడురోజుల్లో కుక్కల సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

■ హబీబ్‌నగర్, ఆటోనగర్, ఇండస్ట్రీయల్ ఏరియాలో డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉంది. చెత్తకుండీ కూడా ఏర్పాటు చేయండి. అలాగే కుక్కలు అధికంగా ఉన్నాయి.

-మోసీన్‌ఖాన్, ముఖిత్‌పారుకీ

✤ డ్రెయినేజీ సమస్య రేపటిలోగా పరిష్కరిస్తాం. నేను కూడా స్వయంగా పర్యటిస్తాను. చెత్త కోసం చెత్తకుండీని ఏర్పాటు చేస్తాం. కుక్కల బెడదను నివారిస్తాం.

✤ కుక్కల సమస్యకు అతి త్వరలోనే పరిష్కారం చూపడం జరుగుతుంది.

■ కోతులను, కుక్కలను అడవుల్లో వదిలివేయాలి. ఏ ప్రాంతంలో కుక్కల సమస్య ఉంటే వారే సమస్యను పరిష్కారించుకునేలా ఆదేశాలివ్వాలి. -రాంచందర్, సుభాష్‌నగర్, తిరుపతి, ఎన్జీవోఎస్ కాలనీ

✤ మీరు చెప్పిన మాట వాస్తవమే.. ఏ ప్రాంతంలో కుక్కల సమస్య ఉంటే వారే పరిష్కరించుకునేలా ఉంటే బాగుంటుంది. ఈ సమస్యకు మావంతుగా కుక్కలను పట్టించి ఆపరేషన్లు చేయిస్తాం.

■ అధికారిక వెబ్‌సైట్‌లో కుక్కల సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- భానుప్రకాశ్, గాయత్రినగర్

✤ గతంలో కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేయించాం. మళ్లీ సమస్య వచ్చింది. కచ్చితంగా కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం.

■ పెద్దమ్మ తల్లి ఆలయంలో కుక్కలు బయట తిరగనివ్వడం లేదు. -కిరణ్, ముబారక్‌నగర్, దత్తు, ఆర్టీసీ కాలనీ, ముబారక్‌నగర్

✤ ఆలయాలకు వెళ్లేటప్పుడు కుక్కల సమస్య అక్కడక్కడ ఉంది. ముఖ్యంగా పెద్దమ్మతల్లి ఆలయం ప్రాంతంలో నాన్‌వెజ్ కోసం తిరుగుతుంటాయి. సమస్యను పరిష్కరిస్తాం.

■ ఆర్యనగర్‌లోని గూడెం ప్రాంతంలో 20 నుంచి 30 కుక్కలు తిరుగుతున్నాయి. హనుమాన్ నగర్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. కొత్తగా వేసిన బ్రిడ్జి వద్ద కుక్కలు అధికంగా ఉంటున్నాయి. వీటిని నివారించాలి. -నవీన్‌రెడ్డి, హనుమాన్‌నగర్, పదాల భూపతి, మహేందర్, ఆర్యనగర్

✤ ఆందోళన చెందకండి. కుక్కలను పట్టించి ఆపరేషన్లు చేయిస్తాం.

■ మానిక్‌భండార్‌లోని కొత్త అపార్టమెంట్ల వద్ద కుక్కల సంచారం చాలా ఎక్కువగా ఉంది. -సాగర్, గంగాధర్, ఆర్టీసీ కాలనీ, మానిక్‌భండార్

✤ కుక్కల సమస్యకు తప్పకుండా పరిష్కారం చూపుతాం. వారం రోజుల్లోపు ప్రత్యేక టీంలు ప్రతి ప్రాంతంలో కుక్కలను పట్టుకొని ఆపరేషన్లు చేయడం జరుగుతుంది.

■ 6వ డివిజన్‌లోని హౌసింగ్‌బోర్డుకాలనీలో డ్రెయినేజీ అధ్వానంగా ఉంది. ఈ సమస్యకు పరిష్కరించండి. -శ్రావణ్, హౌసింగ్‌బోర్డు కాలనీ

✤ శానిటేషన్ సిబ్బందిని పంపించి మీ సమస్యకు పరిష్కారం చూపిస్తాం. ప్రతి డ్రెయినేజీ శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం.



ఫోన్‌ఇన్‌లో పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీర్లు

■ ఊర కుక్కలను పెంచడం వల్ల తిండిలేనప్పుడు సామాన్య ప్రజలపై ప్రతాపం చూపుతున్నాయి. -ప్రశాంత్, శంకర్, దత్తు, శ్రీనగర్ కాలనీ

✤ వీధికుక్కలను పెంచడం సరైన పద్ధతి కాదు. చిన్నపిల్లలు కూడా భయపడుతున్నారు. కుక్కలను పట్టే టీంను పంపిస్తాం. వారు మీ ప్రాంతానికి వచ్చి ఫోన్లు చేస్తారు. ఒకేసారి అన్ని కుక్కలను తీసుకెళ్తారు.

■ మహాలక్ష్మినగర్‌లోని రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదు. -సాయిలు,మధుసూదన్, మహాలక్ష్మి నగర్

✤ రోడ్డు సమస్యను పరిశీలించడానికి సంబంధిత ఏఈని పంపించడం జరుగుతుంది. తదనంతరం రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

■ నగరంలోని 28, 51వ డిజన్లలో కుక్కల బెడ ద తీవ్రంగా ఎక్కువగా ఉంది. 28వ డివిజన్‌లో మూడు పాఠశాలలు ఉన్నాయి. పిల్లలు బడికి వెళ్లాలంటే జంకుతున్నారు. జవాన్లకు చెప్పినా పట్టించుకోవడం లేదు. -సాయి, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్, శివాజీనగర్

✤ మరో రెండు మూడు రోజుల్లో కుక్కల నివారణ చర్యలు చేపడతాం. పాఠశాలలకు వెళ్లే పిల్లలకు తోడుగా వెళ్లండి.

■ నగరంలో దోమల సమస్య అధికంగా ఉంది. ఓపెన్ ప్లాట్‌లలో డ్రెయినేజీ నీరు నిల్వ ఉంటుంది. మురికికాల్వలు కూడా శుభ్రం చేయడం లేదు. -అనిల్, రవీందర్, మహేందర్, గాయత్రినగర్, ఆర్యనగర్

✤ మురికి కాల్వలను శుభ్రం చేయిస్తాం. అలాగే సంబంధిత ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇస్తాం. డ్రెయినేజీలు లేనిచోట నిర్మిస్తాం. మీ సమస్య పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటాం.

## క్లుప్తంగా

### దుబాయ్‌లో పార్థసారథికి ఘన స్వాగతం



పెర్కిట్(ఆర్మూర్): దుబాయ్‌లో ఎమిరేట్స్ ఫార్మసి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ చిట్ల పార్థసారథికి ఘనంగా స్వాగతం పలికారు. అనధికార పర్యటనలో భాగంగా దుబాయ్‌లో పర్యటిస్తున్న ఆయనను వివిధ ఉపాధి హోదాల్లో ఉన్న నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌వాసులు పార్థసారథి కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండో అరబ్ కౌన్సిలర్ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ లిట్రేచర్ కన్వీనర్ మహమ్మద్ అదీబ్ ఉల్లా, డాక్టర్ గోఫ్‌తిఖర్, అలీముద్దీన్, అహ్మద్, అస్సార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తర తిరుపతి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు



నిజామాబాద్ సిటీ : నగరంలోని ఉత్తర తిరుపతి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవరోజు ఆలయంలో ధ్వజారోహణం, గణపతి హోమం, నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలు జరిగాయి. తిరుమల నుంచి విచ్చేసిన వేదపండితులు నారాయణ భట్టిదార్ బృందం ఆధ్వర్యంలో పైకార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిషోర్ స్వామి, మోహన్ దత్తా, దేవాలయం ట్రస్టీ సంపత్‌కుమార్, జలంధర్, భక్తులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 2,483 మంది విద్యార్థులకు గానూ 2,258 మంది హాజరయ్యారన్నారు. ఎల్‌ఎల్‌బీ 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 36 మందికి గానూ 27 మంది, ఎల్‌ఎల్‌బీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలో 24మంది కి గానూ 21 మంది, ఎల్‌ఎల్‌ఎం 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 12 మందికి గానూ అంతా హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

### డిపాజిట్‌దారులు నష్టపోకుండా చూస్తాం



మోర్తాడ్ : తాళ్లరాంపూర్ సహకార సంఘం డిపాజిట్ చేసినవారికి ఎలాంటి నష్టం జరుగకుండా చూస్తామని జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం వెల్లడించారు. సోమవారం సహకార సంఘం మహాజన సభను నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డీసీవో మాట్లాడుతూ డిపాజిట్‌దారులకు ఆర్‌బీఐ గైడ్ లైన్స్ ప్రకారం 6.10 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. ఆస్తుల అమ్మకం ప్రక్రియ కొనసాగుతుందని డబ్బులు జమ కాగానే మార్చి నెలాఖరులోగా అందరికి డబ్బుల చెల్లిస్తామన్నారు. చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా సంఘం డైరెక్టర్లు, క్లస్టర్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్, ఎడీసీసీబీ ఏర్గట్ల శాఖ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.

### నేటి నుంచి సీసీటీవీ కోర్సులో శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎసెటీఐ) వారి ఆధ్వర్యంలో మంగళవారం (28) నుంచి సీసీటీవీ కోర్సులో శిక్షణ ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 రోజుల ఈ శిక్షణతోపాటు భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రం, టూల్‌కిట్స్ అందిస్తారని తెలిపారు. 08461-222428, 08461-295428లో సంప్రదించాలన్నారు.

# 'ప్రజావాణి'కి 137 ఫిర్యాదులు

- ప్రజావాణికి ప్రాధాన్యమివ్వాలి
- సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం



కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 137 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు చేపట్టిన చర్యల గురించి అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి..**

నగరంలో తప్పుడు ఇంటినెంబర్లతో ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ది రామకృష్ణ, ఆయన తండ్రి మహేష్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కుమ్మక్కై తప్పుడు ఇంటినెంబర్‌తో ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు.

**బడ్జెట్‌లో నిధులు పెంచి ఆదుకోవాలని ధర్నా..**

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు నిధులు పెంచి ఆదుకోవాలని సీపీఎం కేంద్రకమిటీ పిలుపులో భాగంగా సోమవారం జిల్లాకమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లాడుతూ నిరుద్యోగం, పేదరికం తగ్గించేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్రాములు, సబ్బని లత, పల్లపు వెంకటేష్, సుజాత, వై గంగాధర్, అనిల్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

**కుక్కల, కోతుల నుంచి కాపాడండి..**

ఖలీల్‌వాడి : కుక్కలు, కోతుల బెడద నివారించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నగర్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

### 'నా భర్తను స్వదేశానికి రప్పించండి'



పిల్లలతో కలిసి ప్రజావాణికి వచ్చిన బాధితురాలు సవిత

సుభాష్‌నగర్ : గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయి సౌదీ అరేబియాలో ఇబ్బందులు పడుతున్న తన భర్త సాయికుమార్‌ను దేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని వినాయక్‌నగర్‌కు చెందిన సవిత ముగ్గురు కుమార్తెలతో కలిసి సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ సాయికుమార్ యమహా షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేసేవాడని, సౌదీ అరేబియాలో పెట్రోల్ మెకానిక్ శిక్షణ ఇప్పించి 1500 రియల్స్ వేతనంతో ఉద్యోగం ఇప్పిస్తామని ఏజెంట్ డీకంపల్లి పోశెట్టి కొడుకు దీపక్ రూ.లక్ష తీసుకుని పంపించారన్నారు. కాని శిక్షణ ఇప్పించకుండా, గ్యాస్ కంపెనీలో లేబర్‌గా పనిచేయిస్తున్నారన్నారు. ఆరోగ్యరీత్యా ఇబ్బంది పడుతూ రోజూ ఫోన్‌లో ఆయన రోధిస్తున్నారన్నారు. ఏజెంట్‌ను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని, 4వటౌన్ ఎస్సైకి ఫిర్యాదిస్తే లైసెన్స్ ఉన్న ఏజెంట్‌ను ఏమీ చేయలేమంటున్నారని, సీపీకి సైతం వినతిపత్రమిస్తామన్నారు.

### ఎన్సీఎస్‌ఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలి



కలెక్టర్‌కు నోటీసును అందజేస్తున్న రైతులు, వాటాదారులు

సుభాష్‌నగర్ : సారంగాపూర్‌లోని ఎన్సీఎస్‌ఎఫ్‌ని రైతు వాటాదారుల సర్వసభ్య సమావేశం వచ్చే 28వ తేదీలోపు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును రైతులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి నోటీసును అందజేశారు. 14ఏళ్లుగా సర్వసభ్య సమావేశం జరపడంలేదన్నారు. సహకార చట్టం బైలా 28(ఏ) ప్రకారం ఈసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాలని చైర్మన్, కలెక్టర్‌కు నోటీసులు అందజేశామన్నారు. కలెక్టర్ సమావేశం నిర్వహించకపోతే మార్చి 29న ఫ్యాక్టరీలనే సమావేశం నిర్వహిస్తామన్నారు. గతంలో ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్వసభ్య సమావేశం నిర్వహించాలని వాటాదారులు సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో రైతులు, వాటాదారులు ఆకుల పాపయ్య, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

### అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2006-07 బ్యాచ్ విద్యార్థులు

ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. పిప్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెంది 2006–2007 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానించారు. అలాగే చాలాకాలం తర్వాత కలిసి స్నేహితులతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

– ఆర్మూర్ టౌన్

### నేడు తెయూలో వర్క్‌షాప్



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం (28న) 'అప్లికేషన్స్ ఆఫ్ స్టాటస్టిక్స్ ఇన్ సైన్స్' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కే సంపత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వర్క్‌షాప్‌లో వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల మాథ్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### రైలు నుంచి దిగబోయి వ్యక్తి మృతి



జగదీష్ రాజ్‌పురోహిత్ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్ : వేగంగా వెళ్తున్న రైలు నుంచి దిగబోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జగదీష్ రాజ్‌పురోహిత్ (28) మిర్యాలగూడ పట్టణంలో ఫ్లెవుడ్ దుకాణం నిర్వహిస్తూ రవీంద్రనగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. అహ్మదాబాద్ నుంచి మిర్యాలగూడకు వచ్చేందుకు ఆదివారం బావానగర్- కాకినాడ రైలు ఎక్కాడు. రాత్రి 11: 45 నిమిషాలకు మిర్యాలగూడ స్టేషన్‌లో ఆగిన రైలు తిరిగి కదిలింది. నిద్రలో ఉన్న జగదీశ్ రాజ్‌పురోహిత్‌కు మెలకువ రావడంతో వెళ్తున్న రైలు నుంచి రెండో ప్లాట్‌ఫాంపై దిగేందుకు దూకాడు. ప్రమాదవశాత్తు అతడు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుని, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ..



సామల సాయిలు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన సామల సాయిలు(51) ఆదివారం రాత్రి నిజామాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సాయిలు గత కొంతకాలంగా మద్యానికి బానిసవడంతో అతని ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో 6 నెలలుగా పని చేతకాకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు ఈ నెల 25వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే సాయిలును చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కామారెడ్డి ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం రాత్రి నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయిలు తుదిశ్వాస విడిచాడు. మృతుని భార్య జయమ్మ ఫిర్యాదు మరకు కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

### రాత్రివేళ దుకాణాలు తెరిచి ఉంచిన వారిపై కేసులు

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేట్‌నైట్ వరకు తెరిచి ఉంచిన షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. జునేరియా హోటల్, రెన్‌బో బార్, స్నూకర్ సెంటర్‌పై కేసులు నమోదు చేశామన్నారు. షాప్ యాజమాన్యలు అర్ధరాత్రి వరకు షాపులను తెరిచి ఉంచవద్దని, తొందరగా మూసి వేసి సహకరించాలని తెలిపారు.

### బైక్ చోరీ

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీనివాస వైన్స్ ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రాయకూర్ గ్రామానికి చెందిన శంకర్ వైన్స్ షాప్‌లో పని చేస్తాడు. విధులు ముగించుకుని బయటకు వచ్చి చూసే సరికి బైక్ కన్పించలేదు. సమీపంలో వెతికినప్పటికీ దొరకనందున పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

### ట్రాక్టర్ కిందపడి గాయాలు..



ధర్పల్లి (ఇందల్వాయి): ఇటుక బట్టీలో ఇటుకల తయారీకి మట్టిని బట్టీ కార్మికుడు కేజ్‌వీల్ ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న తరుణంలో ట్రాక్టర్ బోల్తా పడి దాని కింద చిక్కుకొని రెండు గంటలపాటు నరక యాతన అనుభవించిన సంఘటన ఇందల్వాయి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులోని ఒక ఇటుక బట్టీలో మహారాష్ట్ర చెందినవాసి నాగనాథ్ పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం కేజ్‌వీల్ ట్రాక్టర్ తో మట్టిని తొక్కిస్తున్నప్పుడు ట్రాక్టర్ ఒకసారిగా తిరగబడి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగనాథ్ కాళ్లు ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకుపోవడంతో బయటకు రాలేక పోయాడు. అది గమనించిన తోటి కార్మికులు స్థానికుల సాయంతో రెండు గంటలపాటు శ్రమించినా ట్రాక్టర్‌ను అక్కడి నుండి కదపలేకపోయారు. అనంతరం జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను పక్కకు జరపడంతో బాధితుడు ప్రాణాలతో బయటపడ్డాడు. కాళ్లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అక్కడి నుండి ఆస్పత్రికి తరలించారు.

### గొడ్డలితో దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన హనుమ శేఖర్ గొడ్డలితో దాడి చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమశేఖర్‌ను ఆర్యనగర్‌లో ఉన్న తన బంధువులు హనుమా గంగాధర్ అలియాస్ చిన్న గంగాధర్, అతని కుమారుడు నరేష్ వారి ఇంటికి పిలిపించారు. పందిపిల్ల కనబడటం లేదని పేర్కొంటూ గతంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని గొడవకు దిగారు. ఇద్దర కలిసి గొడలితో హనుమ శేఖర్‌ను గాయపర్చి పారిపోయినట్లు తెలిపారు. హనుమ శేఖర్ ఫోన్‌లో భార్యకు సమాచారం అందించి అనంతరం శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ప్రమాదానికి గురైన వారు దొంగలుగా గుర్తింపు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు దొంగలుగా గుర్తించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుద్వాన్‌పూర్ గ్రామంలోని మెబైల్ దుకాణంలో దొంగతనానికి పాల్పడి పారిపోతుండగా చెట్టుకి ఢీకొని ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పిట్లం అంజి(23), తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18ఏళ్ల వయస్సు వ్యక్తి షేక్ సొహైల్ గా గుర్తించామన్నారు. వీరిద్దరు నిర్మల్ పట్టణానికి చెందిన వారని, వీరిరువురు కలిసి నిర్మల్, ఇచ్చోడ, దిల్వార్‌పూర్, జగిత్యాల, మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడి జైల్‌కి వెళ్లి వచ్చినవారిగా గుర్తించామన్నారు. నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామానికి వచ్చి చోరీకి వచ్చి ప్రమాదానికి గురయ్యారన్నారు.



# శుభకార్యానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..

- బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకుల దుర్మరణం
- మెదక్ జిల్లా చౌట్లపల్లి వద్ద ఘటన
- మృతులు సమీప బంధువులు
- సజ్జన్‌పల్లిలో విషాదఛాయలు



విజయ్ వీర్ (ఫైల్)



పోచయ్య(ఫైల్)

లింగంపేట: వివాహ విందులో పాల్గొనేందుకు బయలుదేరిన ఆ యువకులు.. కొద్ది నిమిషాలయితే గమ్యస్థానానికి చేరేవారు. ఇంతలోనే మృత్యువు ఎదురువచ్చింది. రోడ్డు ప్రమాదం వారి ని బలితీసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

లింగంపేట మండలం సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన మంత్రి విజయ్ వీర్(26), అదే గ్రామానికి చెందిన పోచయ్య(23) అన్నదమ్ముల కుమారులు. గ్రామంలో శుక్రవారం వీరి బంధువుల వివాహం జరిగింది. గ్రామస్తులు ఆదివారం రాత్రి మెదక్ జిల్లా హవేళి ఘణపూర్ మండలం చౌట్లపల్లి గ్రామంలో నిర్వహించే పెళ్లి రిసెప్షన్‌కు బయలుదేరారు. అందరూ డీసీఎం వ్యాన్ లో వెళ్లగా.. విజయ్ వీర్, పోచయ్య బైక్‌పై బయలుదేరారు. అంతా సాఫీగా సాగితే మరో పది నిమిషాలలో గమ్యస్థానానికి చేరేవారు. కానీ చౌట్లపల్లి–ఘన్‌పూర్ మధ్యలో మృత్యువు వారిని వెంటాడింది. చౌట్లపల్లి శివారులో వీరి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**దత్త పుత్రుడు..**

పోచయ్య, రుక్కవ్వలకు సంతానం లేదు. దీంతో వీరు విజయ్ వీర్ ఏడాది వయసున్నప్పుడే దత్తత తీసుకుని అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేశారు. రెండేళ్ల క్రితం మహేశ్వరితో వివాహం జరిపించారు. వీరికి ఏడాది వయసున్న కూతు రు ఉంది.

**రోడ్డున పడిన కుటుంబం**

విజయ్ వీర్ నాన్న పోచయ్య అనారోగ్యంతో మంచం పట్టాడు. నానమ్మ పర్వవ్వ పరిస్థితీ అంతే.. తల్లి రుక్కవ్వతో కలిసి విజయ్‌వీర్ ఉన్న ఎకరం భూమిని సాగు చేసుకుంటూ, కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో విజయ్‌వీర్ మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయ్యింది.

**ఆసరాగా ఉంటాడనుకుంటే..**

సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు, మైసవ్వకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాయిలు, చిన్న కుమారుడు పోచయ్య. పోచయ్య వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసేవాడు. చేతికి వచ్చిన కొడుకు తమకు అన్ని విధాలా ఆసరాగా ఉంటాడనుకుంటే.. అర్ధంతరంగా తనువు చాలించి వెళ్లిపోయాడని అతడి తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

### బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు..





అరవింద్‌గౌడ్, ఎల్లుగొండ (ఫైల్)

బాన్సువాడ రూరల్: బాన్సువాడ–గాంధారి ప్రధాన రహదారిపై మొండి సడక్ గండి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మృతుల్లో ఒకరు బిచ్కుంద మండల పుల్కల్ గ్రామానికి చెందిన ఎల్లుగొండ(40) కాగా, మరొకరు బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన అరవింద్‌గౌడ్(28). వివరాలిలా ఉన్నాయి. కోనాపూర్ గ్రామంలో ఎల్లమ్మ పండుగ జరుగుతోంది. దీంతో అరవింద్ గౌడ్ సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన తన మేనమామ కుమారుడు కృష్ణాగౌడ్‌తో కలిసి కొత్తబట్టలు కొనుగోలు చేసుకోవడానికి సోమవారం బైక్‌పై బాన్సువాడకు వెళ్లాడు. షాపింగ్ పూర్తయ్యాక తిరుగపయనమయ్యాడు. అదే సమయంలో బిచ్కుంద మండలం పుల్కల్‌కు చెందిన ఎల్లుగొండ స్ప్రే పంపుతో పాటు జీవాలకు కొన్ని మందులు కొనుగోలు చేయడానికి బాన్సువాడకు వస్తున్నాడు. మొండి సడక్ గండి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఎల్లు గొండ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. కొన ఊపిరితో ఉన్న అరవింద్‌ను, స్వల్పగా యాలైన కృష్ణాగౌడ్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అరవింద్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.కృష్ణాగౌడ్ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. అరవింద్‌కు ఇంకా వివాహం కాలేదు. అతడికి తల్లిదండ్రులు రుకుంబాయి, సాయాగౌడ్ ఉన్నారు. ఎల్లుగొండకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాన్సువా డఆస్పత్రికి తరలించారు.మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

# రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి) : ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గణితంలో రాణించాలని తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ పిలుపునిచ్చారు. తెయూ మాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'జోవియాలిటి ఆఫ్ మాథమెటిక్స్' నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్ లో వీసీ, ప్రధాన వక్తగా హాజరైన వరంగల్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపిక లీల మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని లెక్కలంటే మనలో ఉన్న భయాన్ని పోగొట్టుకోవాలని వీసీ సూచించారు. వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి, వీసీ కేక్ కట్ చేశారు. ప్రధాన వక్త దీపిక లీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు కె.శ్వేత, ఎం.చంద్రశేఖర్, యు.పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన వారిలో ముగ్గురు విద్యార్థులకు వీసీ రవీందర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఇందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, కామారెడ్డి విద్యార్థి కి రూ.3వేలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, ఆర్మూర్ విద్యార్థికి రూ.2 వేలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల, కామారెడ్డి విద్యార్థి కి రూ.వేయి అందజేశారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బొల్లారం స్వామి (ఫైల్)

డిచ్‌పల్లి : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బొల్లారం స్వామి (48) అప్పుల బాధతో మనస్తాపానికి గురైన విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు డిచ్‌పల్లి ఎస్సై కే.గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం స్వామికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కొంత కాలం గల్ఫ్‌కు వెళ్లి వచ్చిన స్వామి వ్యవసాయం చేస్తున్నాడు. గల్ఫ్, పంట సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీనికి తోడు కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుండగా ఇటీవలే ఒక ఎకరం అమ్మినా అప్పులు తీరక పోవడంతో మనస్తాపంలో ఈనెల 25న విషం తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వామి సోమవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కూతురి హత్య కేసులో జీవిత ఖైదు

- ప్రియుడితో కలిసి తల్లి ఘాతుకం
- నిజామాబాద్ సెషన్స్ జడ్జి తీర్పు

ఖలీల్‌వాడి : అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని ఆరేళ్ల కూతురిని ప్రియుడితో కలిసి హత్య చేసిన తల్లి, సహకరించిన ప్రియుడికి జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ పీఎస్ పరిధిలో ఆగస్టు 22, 2022న చిన్నాపూర్ అటవీప్రాంతంలో ఆరేళ్ల బాలిక మృతదేహం లభ్యమైన కేసులో ప్రాథమిక నివేదికను మాక్లూర్ పీఎస్ పోలీసులు కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో నార్త్ సీఐ బి నరహరి 45 రోజుల్లో నేర విచారణ పూర్తి చేసి, అభియోగాలను కోర్టులో సమర్పించారు. విజయవాడకు చెందిన కాపర్తి దుర్గాభవాని బతుకుదెరువు కోసం నిర్మల్‌కు వచ్చారు. అయితే తన భర్త గురునాథం మేస్త్రీ పని చేయకుండా ఆటో నడుపుతున్నాడని గొడవపడి తిరిగి విజయవాడ వెళ్లారు. అయితే నిర్మల్‌లో ఉన్న సమయంలో దుబాయి శ్రీనుతో భవానీకి పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. విజయవాడ వెళ్లిన ఆమె భర్తకు చెప్పకుండా ఆరేళ్ల కూతురు నాగలక్ష్మి, 14నెలల కూతురు గీత మాధురితో నిజామాబాద్ చేరుకుని శ్రీనుతో కలిసి సహజీవనం చేస్తోంది. అయితే అక్రమ సంబంధానికి ఆరేళ్ల కూతురు అడ్డుగా ఉండడంతో శీను రోజూ ఆ బాలికను హింసించేవాడు. ఒకరోజు బాలికకు బీడీలతో వాతలు పెట్టగా పెద్దగా అరవడంతో ఇరువురు కలిసి గొంతునులిమి బాలికను హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా శవాన్ని ఆర్టీసీ బస్సులో చిన్నాపూర్ గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. తర్వాత సమీప అడవిలోని కాలువలో పడేశారు.

అనంతరం దుర్గాభవాని తన తల్లికి ఫోన్ చేసి బాలిక నాగలక్ష్మికి గాయాలయ్యాయని పేర్కొనగా ఆమె తన అల్లుడు గురునాథంతో నిజామాబాద్ వచ్చి చిన్నారి జాడ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు నేర విచారణ చేసి దుర్గాభవానీ, శీనును అరెస్ట్ చేయగా వారు నేరాన్ని అంగీకరించారు. వీరిపై నేరారోపణలు రుజువు కావడంతో ఇద్దరికి హత్య కేసులో జీవిత ఖైదు విధించారు. సాక్ష్యాలను తారుమారు చేసిన విషయంలో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఆయనకు కోర్టు డ్యూటీ పోలీస్ ఆఫీసర్స్ విశాల్ గౌడ్ ,విక్రమ్ సహకరించారు.

### పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను వేధించిన కేసులో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన సృజన్ ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేయడం, వెంటపడటంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువకుడిని కోర్టులో హాజరుపర్చామన్నారు.